క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో భజన సంకీర్తనలు



వెల్లటూరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామంలో కొలువైన శ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయంలో ధనుర్మాసం పురస్కరించుకుని ఆదివారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు భజన సంకీర్తనలు, అర్ధ ఏకాహం జరిగింది. పూజా కార్యక్రమాలను మారుతీ సాయిరామ్ శాస్త్రయుక్తంగా నిర్వహించారు. సమరసత సేవా ఫౌండేషన్(ఎస్ఎస్ఎఫ్) గ్రామ కన్వీనర్ నంబూరు పద్మజ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వెల్లటూరు, కొల్లూరు గ్రామాలకు చెందిన భజన మండలి సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భగవద్గీత పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ జిల్లా మహిళా కన్వీనర్ బొలగాని విజయలక్ష్మి, ప్రభుత్వ సంబంధాల ప్రముఖ్ బొలగాని వెంకటేశ్వర్లు, వేమూరు సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ క్రాప రవి కుమార్ పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయునికి జంధ్యాల విరాళం



ఐలవరం(భట్టిప్రోలు): మండలంలోని ఐలవరం శ్రీ వేణుగోపాలస్వామి, దేవస్థానంలో కొలువైన ప్రసన్నాంజనేయునికి ఆదివారం గుంటూరుకు చెందిన నందిపాటివారి ఆడపడుచు కొత్త దేవకి దేవి రూ.లక్ష విలువ చేసే వెండి జంధ్యాలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు దీవి రఘునాథ చక్రవర్తి.. స్వామికి ప్రత్యేక పూజలు, ఆకుపూజ, అష్టోత్తర నామ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నందిపాటి నాగమల్లేశ్వరరావు, లక్ష్మీన్నారాయణ, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బండ్లమ్మ అమ్మవారికి వైభవంగా పూజలు



చందోలు(పిట్టలవానిపాలెం) : మండలంలోని చందోలులో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి బండ్లమ్మ అమ్మవారి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పసుపు, కుంకుమలతో అర్చనలు, అభిషేకాలు జరిపించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, దేవాలయ ప్రాంగణంలో పొంగళ్లు పొంగించారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, ఈఓ జి.నరసింహమూర్తి, ఆలయ వంశపారంపర్య అర్చకులు కుంచల బళ్ళారెడ్డి, నరసారెడ్డి తదితరులు ఉన్నారు.

200 చీరలు.. రూ.34వేలు



పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు గ్రామంలో శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో భక్తులు కానుకలు, మొక్కుబడుల రూపంలో చెల్లించిన చీరలకు ఆదివారం బహిరంగ వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ జి.నరసింహమూర్తి మాట్లాడుతూ.. 200 చీరలను బహిరంగ వేలం నిర్వహించగా రూ.34,795ల ఆదాయం లభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ బాపట్ల డివిజన్ ఇన్‌స్పెక్టర్ వి.శ్యామల, ఆలయ దర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వాసవి క్లబ్‌కు రూ.25వేల విరాళం



భట్టిప్రోలు: వాసవి క్లబ్ కేసీజీఎఫ్ స్కీమ్ ద్వారా విద్యార్థులకు అందిస్తున్న పాఠ్య, నోట్ పుస్తకాలు, మెరిట్ స్కాలర్‌షిప్స్ పంపిణీకి భట్టిప్రోలుకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు, క్లబ్ జిల్లా ఇన్‌చార్జ్ బొలిశెట్టి శ్రీనివాసరావు(బీఎస్సార్) రూ.25 వేలు విరాళం అందజేశారు. ఆదివారం జిల్లా గవర్నర్ గోనుగుంట్ల జయంత్ కుమార్‌కు నగదు అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావును క్లబ్ నిర్వాహకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ నిర్వాహకులు మాడా వెంకట సుబ్బారావు, నంబూరు నాగభూషణరావు, తూనుగుంట్ల శ్రీధర్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధికి పట్టం కట్టండి

- మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున
- పెదలంకలో గడప గడపకు మన ప్రభుత్వం



పెదలంకలో మంత్రి నాగార్జునకు సమస్యను వివరిస్తున్న మహిళ

పెదలంక(భట్టిప్రోలు): గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున కోరారు. భట్టిప్రోలు మండలం పెదలంకలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. మంత్రి నాగార్జునకు ఎంపీటీసీ సభ్యుడు నన్నెపాముల చంటి, వైఎస్సార్ సీపీ నాయకుడు మల్లిపెద్ది రామలింగేశ్వరరావు స్వాగతం పలికారు. ప్రజలను మంత్రి ఆప్యాయంగా పలకరించారు. గడప గడపకు వెళ్లి వివిధ సంక్షేమ పథకాల వల్ల చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్లను అందజేశారు. ప్రభుత్వ పథకాలు అర్హులకు అందే విధంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని చెప్పారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లిన మంత్రి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం జగన్ ఎన్నికల హామీలన్నీ అమలు చేశారని, ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలతో ప్రతి ఇంటా వెలుగులు నిండుకున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. తొలుత స్థానిక దేవాలయాలు, చర్చిలో నిర్వహించిన పూజలు, ప్రార్థనల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్య శాస్త్రీ, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ పడమట శ్రీనివాసరావు, సూరేపల్లి, భట్టిప్రోలు పీఏసీఎస్ అధ్యక్షుడు గోవర్ధనగిరి శేషాచల శ్రీనివాసరావు(చినబుజ్జి), గుమ్మడి సాంబ శివరావు, పెసర్లంక, చింతమోటు సర్పంచులు వేములపల్లి వెంకటేశ్వరరావు, గుమ్మడి శంకరరావు, ఐలవరం ఎంపీటీసీ మురుగుత శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు సీహెచ్ రామమోహన్‌రావు, నాదెళ్ల నరేంద్ర, సీహెచ్ ప్రశాంత్, నన్నెపాముల శివకుమార్, నన్నెపాముల నాగేశ్వరరావు, దావూరి నాగమల్లేశ్వరరావు, తిరువీధుల బాలాజీ, గుజ్జర్లమూడి రాజు, మైనేని వెంకటేశ్వరరావు, కొల్లి రమేష్ చౌదరి, మోటూరు చౌదరి, జంగం చంద్రశేఖరరావు, పడమట సాయి, ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు, పంచాయతీ కార్యదర్శులు పుష్పలత, సత్యసాయి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా శ్రీ సీతారాముల కల్యాణం



శ్రీ సీతారాముల కల్యాణంలో పాల్గొన్న దంపతులు

అద్దేపల్లి(భట్టిప్రోలు): భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి శ్రీరామ నామ క్షేత్రంలో నిర్వహిస్తున్న 72వ శ్రీరామ నామస్మరణ కోటి మహోత్సవంలో భాగంగా ఆదివారం శ్రీ సీతారాముల కల్యాణం కనుల పండువగా జరిగింది. స్వామి వారి కల్యాణంలో కొలుసు వీర ప్రసాద్, రాజ్యలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. స్వామి వారికి తెల్లవారుజామున ప్రభాత సేవ, సంఘ సభ్యులు స్మరణ కార్యక్రమం నిర్వహించారు. సహస్ర నామార్చన కావించారు. సాధన మండలి బ్రహ్మ విద్యాశ్రమం ఆధ్వర్యంలో భజగోవిందం, కై వల్యోపనిషత్తు, శ్రీమద్భగవద్గీత పారాయణం చేశారు. శ్రీ బాలా త్రిపుర సుందరి మహిళా సమాజం ఆర్గనైజర్ అల్లం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శ్రీరామ స్తోత్రములు, మహత్యము, పారాయణం చేశారు. మధ్యాహ్నం ఏలూరుకు చెందిన ఎస్.భారతి భగవతారిణి నిర్వహించిన హరికథ కాలక్షేపం భక్తులను ఆకట్టుకుంది. సాయంత్రం శ్రీ కోదండరామ భక్త సమాజం ఆర్గనైజర్ దీపాల సత్యన్నారాయణ ఆధ్వర్యంలో భజన కార్యక్రమం జరిగింది. రాత్రి శ్రీ బాలా త్రిపుర సుందరి నృత్య కళా నిలయం ఆర్గనైజర్ బాడిగ అనిల్ కృష్ణ శిష్య బృందం కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శన నిర్వహించింది. ఈ కార్యక్రమాలను నిర్వాహకులు కొన్నిపాటి భాస్కరరావు, కాగిత దుర్గా ప్రసాదరావు, కాగిత ఆంజనేయులు పర్యవేక్షించారు.

ఉచిత వైద్య శిబిరం



మెడికల్ క్యాంపులో రోగులకు పరీక్షలు, పక్కన అసోసియేషన్ నాయకులు

బాపట్ల అర్బన్: బాపట్ల జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సూపర్ స్పెషాలిటీ మెడికల్ మెగా క్యాంపు ఏర్పాటు చేశారు. కార్డియాలజిస్ట్, జనరల్ మెడిసిన్ డాక్టర్ బి.యజ్ఞ శ్రీకాంత్, రేడియాలజిస్ట్ డాక్టర్ బి.మాధవి సుమారు 150 మందిని పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. బాపట్ల ఎడ్యుకేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ముప్పలనేని శ్రీనివాసరావు, మానం నాగేశ్వరరావు బాపట్ల జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్, తాలూకా అసోసియేషన్ అధ్యక్షులు బొమ్మిశెట్టి వెంకటరత్న గుప్తా, గొల్లపూడి శివరాం ప్రసాద్, టీవీ శ్రీలక్ష్మీ శిరీషా, నారాయణరెడ్డి, తటపర్తి గురుబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

నదీ భూముల్లో సాగుకు అనుమతులు తప్పనిసరి



భూములను బాగుచేస్తున్న వ్యక్తులతో చర్చిస్తున్న ఎస్ఐ శామ్యూల్ రాజీవ్‌కుమార్

కొల్లూరు : కృష్ణా నదిలోని మెరక ప్రాంతాల్లో ప్రభుత్వ అనుమతులు లేకుండా సాగు చేసేందుకు ఆక్రమిత చర్యలు చేపట్టడం చట్టరీత్యా నేరమని కొల్లూరు ఎస్ఐ శామ్యూల్‌రాజీవ్‌కుమార్ హెచ్చరించారు. ఆదివారం మండలంలోని పెదలంక అరవింద వారధి వెంబడి ఉన్న బుసక మేటలో చెట్లను తొలగించి చదును చేసేందుకు సీపీఎం, వ్యవసాయ కార్మిక సంఘం నేతృత్వంలో పెదలంక, చింతర్లంక గ్రామాలకు చెందిన కొందరు రంగంలోకి దిగారు. ఈ పనులను వెంటనే నిలిపివేయాలని ఎస్ఐ ఆదేశించారు. కొల్లూరు తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు ఆదేశాల మేరకు నదీ భూముల్లో చెట్ల నరికివేత, భూములు సరి చేసే ప్రక్రియను ఎస్ఐ నిలుపుదల చేయించడంతో, చెట్లు తొలగిస్తున్న వ్యక్తులు కొల్లూరు పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. వారితో చర్చించిన ఎస్ఐ.. ఎటువంటి అనుమతులు లేకుండా నదీ పరీవాహక ప్రాంతంలోని మేటల్లో చెట్లు నరికి చదును చేయడం వంటి కార్యకలాపాలు చేపడితే చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం పట్టాలు మంజూరు చేయకుండా భూములను స్వాధీనం చేసుకుంటే కఠిన చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మోపిదేవి హరనాథబాబు

నిజాంపట్నం: తీరప్రాంత ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీ మోపిదేవి సోదరుడు, వైఎస్సార్ సీపీ నాయకులు మోపిదేవి హరనాథ బాబు తెలిపారు. నిజాంపట్నం పంచాయతీ కార్యాలయ ఆవరణంలో శ్రీ ప్రతిమ సూపర్ స్పెషాలిటీ సహకారంతో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హరనాథ బాబు మాట్లాడుతూ తీరప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు వైద్యశాలల యాజమాన్యం ముందుకు రావడం హర్షణీయమన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగేంద్రబాబు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, మాజీ బోటు ఓనర్స్ యూనియన్ అధ్యక్షుడు మోపిదేవి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ మోపిదేవి మార్కండేయులు, ఎంపీటీసీ నాజర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

12న సంక్రాంతి సంబరాలు

రేపల్లె: పట్టణంలోని 1వ వార్డు యాదవపాలెంలో సమరతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 12న వివేకానంద జయంతి, సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ మండల కన్వీనర్ పేరం కోటేశ్వరరావు తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సంబరాలలో భాగంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తామన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని 19 నుంచి 26వ తేదీ వరకు గ్రామాల్లో రిపబ్లిక్ డే దినోత్సవాలు, గ్రామ ధార్మిక సభలు నిర్వహించి, భరత మాత పూజలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఈ సమావేశంలో సబ్ డివిజన్ కన్వీనర్ జంగం శ్యాంప్రసాద్, శాంతి బాబూరావు, కుటుంబరావు గుంటి సాంబశివరావు, శివ నాగమల్లేశ్వరరావు, జొన్నలగడ్డ వెంకటరామయ్య, జంజనం హేమశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు

రేపల్లె రూరల్: కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ కిరణ్‌బాబు హెచ్చరించారు. గతంలో కోడి పందేలు, కత్తులు కట్టిన వారికి ఆదివారం సాయంత్రం పోలీసు స్టేషన్‌లో కౌన్సిలింగ్ ఇచ్చారు. పందేలు నిర్వహించిన, పాల్పడిన వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని చెప్పారు. పందేలు నిర్వహించినా, కత్తులు కట్టినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కోళ్లకు కత్తులు కట్టేవారిపై నిరంతరం నిఘా ఉంటుందని తెలిపారు. అనంతరం నిందితులను బైండోవర్ చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి

నిజాంపట్నం: కోడి పందేల స్థావరంపై దాడి చేసి పది మందిని అదుపులోనికి తీసుకుంటున్నట్లు అడవులదీవి ఎస్ఐ రవి తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. అడవులదీవి గ్రామ శివారులో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసినట్లు చెప్పారు. స్థావరంలో పది మందిని, రూ.4వేలు నగదు, నాలుగు పుంజులు స్వాధీన పరుచుకుని, కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. కోడి పందేలు బరికి వినియోగించిన కర్రలను, వలను స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు. నిజాంపట్నం ఎస్ఐ రమేష్, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

అలరించిన స్వరరాగ సమ్మోహనం



గీతాలు ఆలపిస్తున్న సౌజన్య, విద్యా భారతి

బాపట్ల: శారదా ఫైన్ ఆర్ట్స్ అకాడమీ, రోటరీ క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన స్వరరాగ సమ్మోహనం 190 కార్యక్రమం రోటరీ ఆడిటోరియంలో అత్యంత వైభవంగా ఆదివారం జరిగింది. ఈ సభకు విశ్రాంత ఆచార్యులు డాక్టర్ పీవీ రామకుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ప్రముఖ సినీ నటి ప్రగతి, రోటరీ క్లబ్ అధ్యక్షుడు సుధీర్ పాల్గొన్నారు. సినీ సంగీత కళాకారిణులు మాడభూషి సౌజన్య, విద్యా భారతీ స్వర విన్యాసం ఆహుతులను ఆకట్టుకున్నది. హంసధ్వని రాగంలో అన్నమయ్య కీర్తన ప్రారంభించి, దేశ్, కళ్యాణి, మోహన, హిందోళ రాగాలతో స్వరపరిచిన సినీ లలిత గీతాలను మేళవించి ఓ నూతన ప్రయోగాన్ని ఆవిష్కరించారు. సంగీత కార్యక్రమాన్ని ప్రముఖ టీవీ కళాకారిణి భావన సమన్వయపరిచారు. ఈ కార్యక్రమంలో శారదా ఫైన్ ఆర్ట్స్ వ్యవస్థాపక సభ్యులు శ్రీకాంత్, పిల్లుట్ల అన్నపూర్ణ, ఏలూరి హరిబాబు, రోటరీ కార్యదర్శి రాంబాబు, రోటరీ సభ్యులు, సంగీత అభిమానులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

బాపట్ల అర్బన్: బాపట్లలోని శీలంపాలెంలో ఆదర్శ టుటోరియల్స్‌లో 1978–98 సంవత్సరం పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల పూర్ణప్యాలెస్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరగింది. ఈ సందర్భంగా అప్పటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ఒకరినొకరు పలుకరించుకొని, యోగక్షేమాలు తెలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించి, వారి ఆశీర్వాదం తీసుకున్నారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

రేపల్లె: పేకాట ఆడుతున్న ఐదుగురుని అదుపులోకి తీసుకున్న ఘటన రేపల్లె పట్టణంలో ఆదివారం జరిగింది. సీఐ విజయ చంద్ర కథనం మేరకు.. తమ సిబ్బందితో ఉప్పూడి నుంచి అరవపల్లి రోడ్డులో ఆదివారం సాయంత్రం దాడులు నిర్వహించామన్నారు. ఓ ఇంటిలో పేకాట ఆడుతున్న ఐదుగురుని అదుపులోనికి తీసుకుని వారి నుంచి రూ.9,620లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి, కోర్టుకు హాజరుపరచనున్నట్లు చెప్పారు.

వాసవి క్లబ్ నిజాంపట్నం ప్రెసిడెంట్‌గా శ్రీనివాసరావు



ప్రమాణ స్వీకారం చేస్తున్న నిజాంపట్నం వాసవి క్లబ్ నూతన కార్యవర్గం

నిజాంపట్నం: వాసవి క్లబ్ నిజాంపట్నం ప్రెసిడెంట్‌గా బయ్యా శ్రీనివాసరావు, సెక్రటరీగా కాశేపల్లి హనుమాన్‌ను ఎన్నుకున్నట్లు వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మాడా వెంకట సుబ్బారావు తెలిపారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆదివారం నిజాంపట్నం వాసవి క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట సుబ్బారావు మాట్లాడుతూ రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. అనంతరం వాసవిక్లబ్ నిజాంపట్నం ప్రెసిడెంట్‌గా బయ్యా శ్రీనివాసరావు, సెక్రటరీగా కాశేపల్లి హనుమాన్, ట్రెజరర్‌గా వెంకటనాగ గోపీ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గవర్నర్ జయంత్ కుమార్, వైస్ గవర్నర్ సుధీర్, సెక్రటరీ నాగభూషణం, రీజనల్ చైర్మన్ అశోక్, నిజాంపట్నం వాసవి క్లబ్ చార్టర్డ్ ప్రెసిడెంట్ కె.గౌరీశంకర్, మహేంద్రకుమార్, బాబ్జీ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

తెనాలిరూరల్: ఆత్మహత్యాయత్నం చేసిన వివాహిత చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తెనాలి మండలం నంది వెలుగు గ్రామానికి చెందిన పాలపర్తి నాగమల్లేశ్వరి(46) కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ నెల 4న తేదీరులో ఎలుకల మందు కలుపుకుని తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు తెనాలిలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించి, అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తీసుకెళ్లారు. వైద్యశాలలో చికిత్స పొందుతూ నాగమల్లేశ్వరి మృతి చెందింది. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

టీపీఎల్ ప్రారంభం



తెనాలిరూరల్: తెనాలి యువ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో తెనాలి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీని స్థానిక తాలూకా జూనియర్ కళాశాల ప్రాంగణంలో అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ ఘట్టమనేని సాయిరేవతి ఆదివారం ప్రారంభించారు. టెన్నిస్ బాల్‌తో.. 10 రోజుల పాటు టోర్నీని నిర్వహిస్తామని అకాడమీ డైరెక్టర్ హరిదాసు గౌరీశంకర్ తెలిపారు. కోచ్ మాలిక్, బక్కా శివకృష్ణ పాల్గొన్నారు.


లారీని ఢీకొని ద్విచక్ర వాహనదారుడి దుర్మరణం

కృష్ణలంక(విజయవాడతూర్పు): రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... గుంటూరు జిల్లా తెనాలిలోని మారీసు పేటకు చెందిన మీసాల సాయిచరణ్‌తేజ్ (26)మొబైల్ ఫోన్ షాపు నిర్వహిస్తున్నాడు. ఆయనకు సంవత్సరం క్రితం వివాహమైంది. శనివారం ఉదయం పని నిమిత్తం తన ముగ్గురు స్నేహితులతో కలిసి రెండు ద్విచక్ర వాహనాల్లో నగరానికి వచ్చారు. పని ముగించుకుని ఉదయం 4.30 గంటల సమయంలో తెనాలికి వెళ్లే క్రమంలో సాయి చరణ్ తేజ్ ద్విచక్ర వాహనాన్ని నడుపుతుండగా స్నేహితుడు రోషన్ వెనుక వైపు కూర్చున్నాడు. సత్యంగారి హోటల్ సమీపానికి రాగానే రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన లారీని ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనం పైనుంచి ఇద్దరూ కింద పడిపోయారు. సాయిచరణ్‌తేజ్ అక్కడికక్కడే మృతి చెందగా రోషన్ స్వల్పంగా గాయపడ్డాడు. స్థానికులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సంక్రాంతి సందడెక్కడా..?



హరిదాసునికి బియ్యం వేస్తున్న దృశ్యం (ఫైల్)



రోకళ్లతో పిండి కొడుతున్న మహిళలు



గంగిరెద్దుల సందడి

- గంగి రెద్దుల వారి సన్నాయి మేళం
- వేకువ జామున హరిదాసుల సంకీర్తనలు
- సంప్రదాయ బద్ధంగా పిండి వంటల తయారీ
- ఇంకా.. కానరాని సంక్రాంతి శోభ

పిట్టలవానిపాలెం: 'అయ్యగారికి దణ్ణం పెట్టు.. దానాల్లో మా రాజు అయ్యగారు.. అమ్మగారు అన్నపూర్ణ.. చిన బాబు కలక్టర్, చిన్నమ్మ డాక్టరమ్మ అవుతారు.. మీ ఇంటికి బసవన్న వచ్చాడు. అయ్యగారూ.. అమ్మగారూ.. పాత పంచో, చీరో ఇచ్చి పుణ్యం కట్టుకోండి.' అంటూ సాగే... గంగిరెద్దుల వారి సన్నాయి మేళంతో గ్రామాల్లో సంక్రాంతి సందడి మొదలయ్యేది. బసవన్నలు ఇంటి ముందుకు వస్తే దేవుడే వచ్చాడని గ్రామస్తులు విశ్వసిస్తారు. ఇంటి ముందుకు వచ్చిన బసవన్నలను పసుపు, కుంకుమలతో పూజించి గంగిరెద్దుల వారితో ఆశీర్వాదం పొందేవారు. దానాల కోసం వచ్చే వారు అవతలి వారిని పొగడ్తలతో నవ్వించేవారు. రైతులు సంక్రాంతి పండుగ సమయంలో దానాలు ఎక్కువగా చేసేవారు. రాను రానూ.. గంగిరెద్దులు ఆడించే వారే తక్కువయ్యారు.. గ్రామ గ్రామానా కాళ్లరిగేలా తిరిగినా దానం చేసేవారు తరిగిపోయారు.

వినిపించని హరిదాసు కీర్తనలు

హరిలో రంగ హరి.. అని తలపై అక్షయ పాత్ర పెట్టుకుని వేకువజామునే ఇంటి ముంగిటకు నడచి వచ్చే హరిదాసులు నేడు కానరావడం లేదు. వారి సంకీర్తనలు ఎక్కడా వినిపించడం లేదు. నెల ముందుగానే హరిదాసు రాకతో.. సంక్రాంతి పండుగ ప్రారంభమయ్యేది. నెల రోజుల పాటు హరినామ సంకీర్తన గావిస్తూ.. ఊరి జనం అక్షయ పాత్రలో వేసిన బియ్యం, ధాన్యం సగ భాగం ఇంటి నిర్వహణకు, మిగిలినవి రామాలయాల్లో, భక్తులకు దానం చేసేవారు. ఇది హరిదాసుల పరంపరలో అనాదిగా వస్తున్న ఆచారం. ఒక వీధిలో తిరిగేసరికి అక్షయపాత్ర బియ్యం, దక్షణలతో నిండిపోయేది. ప్రస్తుతం హరిదాసులు చిడతలు పక్కన పెట్టి.. హరి సంకీర్తనలు వదలి ఇతర రంగాలవైపు ఉపాధి కోసం వెళ్లిపోతున్నారు.

రోకలి పోట్లు ఎక్కడ..?

సంక్రాంతి పండుగ అనగానే గుర్తొచ్చేది, నోరూరించేవి పిండి వంటలు. ముఖ్యంగా అరిసెలు. బియ్యం నానబెట్టి.. రోకలి పోట్లతో పిండి చేసే విధానం ప్రస్తుతం ఎక్కడా లేదు. కొన్ని గ్రామాల్లో అక్కడక్కడా మాత్రమే రోకళ్లతో బియ్యం దంచుతున్నారు. దంచిన బియ్యపు పిండితో తయారు చేసిన వంటల రుచే వేరని పెద్దలు చెప్తారు. పిండి మిల్లుల్లోనే బియ్యపుపిండి తయారై పోతోంది.

రోజంతా కష్టపడితేనే..



రోజంతా కష్టపడితేనే మాకు జరుగుబాటు. గతంలో గంగి రెద్దులతో గ్రామాలకొస్తే.. దానాలుండేవి. గ్రామీణ పరిస్థితులు మారాయి. ఆదరణ తక్కువైంది. ఈ వృత్తిని మరో దారి లేక వదలుకోలేకున్నాం.

– సుబ్బారావు, గంగిరెద్దుల కాపరి